"సంబంధాలు చూడాల్సిన అవసరం లేదు." ఉన్నట్లుండి చెప్పింది సునంద.

ఆమె తల్లి సీతమ్మ, తండ్రి జానకిరామయ్యలు సునంద పెళ్ళి గురించి తర్జనభర్జనలు చేస్తున్నారు. వారి ముందు పెళ్ళిళ్ళపేరయ్య తెచ్చిన కొన్ని సంబంధాలు ఉన్నాయి. పెళ్ళి కొడుకుల ఫొటోలు - జాతకాలు - వారి బయోడేటాలు ఉన్నాయి.

ఆ దంపతులు వాటిని నిశితంగా పరిశీలిస్తున్నారు. వాటిలో ఏది తమ ముద్దులగారాల పట్టికి నప్పుతుందోనని.

జానకిరామయ్య టీచరుగా ఉద్యోగం చేస్తున్నాడు. ఇంకో సంవత్సరంలో రిటైర్ కావాలి. కానీ సునంద పెళ్ళి గురించి వాలంటరీ రిటైర్‌మెంట్ కోసం. అభ్యర్థించాడు. ఆ వచ్చే రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌తో సునందకు రంగరంగ వైభవంగా పెళ్ళి చేయాలని –తనకు మిగిలిన బాధ్య



# సునంద

త నిర్వహించాలని తహతహలాడుతున్నాడు.

సునంద ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తోంది. నెలకు పదిహేను వేలు సంపాదిస్తోంది. ఇంకా మంచి ఉద్యోగం కోసం అన్వేషిస్తోంది. బీటెక్ అయిపోయింది. కంప్యూటర్ కోర్సులు కూడా చేసింది.

సునంద తన స్నేహితురాలి పెళ్ళికి వెళ్ళి వచ్చేసరికి తల్లిదండ్రులు దీక్షగా ఫొటోలు, జాతకాలూ చూస్తూ ఆలోచనల్లో మునిగిపోవడం గమనించింది.

సీతమ్మ సునందను పిల్చి అడిగింది. "సునందా! ఈ ఫొటోల్లో నీకు నచ్చిన కుర్రాడున్నాడేమో చూడు".

"తల్లీ, సునందా! ఇవన్నీ మనకు తెల్సినాయనద్వారా వచ్చిన సంబంధాలు – మాకయితే అన్నీ బాగున్నాయనిపిస్తున్నాయి. మేము పాతకాలం మనుషులం. అందుకే నీ పెళ్లి గురించి నువ్వే ఒక నిర్ణయం తీసుకుంటే బాగుంటుంది. వీటిల్లో నీకు నచ్చిన సంబంధాలు ఉంటే – వాటి గురించి విచారిద్దాం!" జానకిరామయ్య అనునయంగా చెప్పాడు.

అప్పుడు సునంద బాంబులా తన మనసులో మాట పేల్చింది. "సంబంధాలు చూడాల్సిన అవసరం లేదు" అంటూ.

ఆ మాటకు ఆమె తల్లిదండ్రులు నివ్వెరపోయారు. ముందుగా సీతమ్మ తేరుకుంది.

"అదేంటే పిచ్చితల్లీ! సంబంధాలు వద్దంటావు – పెళ్ళి చేసుకోవా? జీవితాంతం బ్రహ్మచారిణిగానే ఉండిపోతావా? ఇదేం చోద్యం?" అంది.

సునంద మౌనం పాటించింది.

"అది కాదు సునందా! ప్రస్తుతం పెళ్ళి చేసుకునే ఆలోచన లేదా? ఏదో ఉద్యోగంలో ఉండగానే ఆ ముచ్చట చేద్దామనుకున్నాను – కానీ కాలం కలిసిరాలేదు. నువ్వు ఉద్యోగస్తురాలివి కూడా అయ్యావు. ఇంకా ఆలస్యంచేస్తే ఆలస్యం అమృతం విషం అవుతుంది. సంబంధాలు ఇప్పట్నించీ చూద్దం ప్రారంభిస్తే కుదిరేటప్పటికి కొంత టైం పడుతుంది" జానకిరామయ్య చెప్పాడు.

సునంద గోళ్ళు గిల్లుకుంటూ కూర్చుంది.

"ఏమే... మాట్లాడవు. అసలు నీ మనసులో ఏముందో చెప్పు" గద్దించింది తల్లి సీతమ్మ.

అప్పుడు సునంద ధైర్యం తెచ్చుకుని కుండబద్దలు కొట్టినట్లు చెప్పింది. "నా గురించి మీరు కష్టపడాల్సిన అవసరం లేదు. నా పెళ్ళి నాకు వదిలెయ్యండి!"

సీతమ్మ, జానకిరామయ్య మళ్ళీ నివ్వెరపోయారు.

"ఒసే! మనది సాంప్రదాయ కుటుంబం! నిన్ను గాలికి వదిలేస్తే నలుగురూ ఏమనుకుం

**వియోగి**

టారు?" సీతమ్మ బుగ్గలు నొక్కుకుంది.

"సునందా! మా పరువు నడిబజారులో పడే ద్దామనుకున్నావా? ఇన్నాళ్ళూ గౌరవంగా బ్రతి కాం - ఈ ఒక్క పనీ ముగించేస్తే కృష్ణా... రామా... అనుకుంటూ ఏ ఆశ్రమంలోనో తల దాచుకుంటాం!" జానకిరామయ్య బరువుగా చెప్పాడు.

"నాన్నా! నేను మీ కూతురిని! మీ పరువు పోయే పని ఎందుకు చేస్తాను? నేను బ్రతికిఉం డగా ఆశ్రమంలో ఉండాల్సిన ఖర్మ మీకేం పట్టింది?" నిష్ఠూరంగా అంది సునంద.

"కూతురింట్లో ఉంటే లోకం నవ్విపోదూ? నువ్వంటే మా కడుపున పుట్టావుగానీ - అల్లుడు పుట్టలేదు కదా!" సీతమ్మ వెంటనే అంది.

"అలాంటి బేధభావం ఈ కాలంలో లేదు. కూతురైనా - కొడుకైనా తల్లిదండ్రుల బాధ్యత చూడాల్సిందే!" బాధగా అంది సునంద.

ఆ బ్రహ్మ "మా మొహాన ఇద్దరూ ఆడపిల్ల ల్నే రాసాడు. ఒక మగనలుసును ఇచ్చుంటే వృద్ధాప్యంలో మాకు దిగులు ఉండేది కాదు - నీ కామాత్రం ప్రేమ ఉంది చాలమ్మా! ఆ గౌర వం నిలబెట్టుకోవాలంటే ఎవరి ఇంట్లో వాళ్ళుం డడం మంచిది!" జానకిరామయ్య చెప్పాడు.

"నా పెళ్ళి కాకుండానే మీరు నన్ను పరాయి దానిలా భావిస్తున్నారు - అయినా చేసి చూపిస్తా ను... ఊరికే మాటలు చెప్పను" సునంద రోషంగా చెప్పింది.

"సరే - అవన్నీ తరువాత పెళ్ళిళ్ళ పేరయ్య సాయంత్రం వస్తానన్నాడు. ఈలోగా మనకు నచ్చిన సంబంధం తేల్చుకోమన్నాడు. మాకయి తే ఈ చీరాల సంబంధం నచ్చింది - కాకపోతే కట్నం నాలుగు లక్షలట! నంద్యాల వాళ్ళది బాగుంది కానీ... కట్నం తక్కువే - అబ్బాయి జీతమూ తక్కువే! ఆదోని వాళ్ళది మనకు అందు బాటులో లేదు. అయిదు లక్షల కట్నంట!" సీత మ్మ చెప్పింది.

"సీతా! అవన్నీ అమ్మాయికి చెప్పాలా? ఏ కుర్రాడు బాగున్నాడో అడుగు - చాలు" విసుగ్గా అన్నాడు జానకిరామయ్య.

"నాన్నా! నాకు ఈ సంబంధాలు ఏవీ వద్దు!" చెప్పింది సునంద.

"ఎందుకొద్దే! ఇంతకంటే మంచి సంబం ధం మనం ఎక్కణ్ణించి తీసుకురాగలం? - మన బంధువుల్లో ఎవరూ లేరు కూడా!" సీతమ్మ చెప్పింది.

"సునందా! నాకేదో అనుమానంగా ఉంది - నీ మనసులో ఏముంది?" జానకిరామయ్య సందేహించాడు.


"నాన్నా! ఈ సంప్రదాయాలు- ఈ పెళ్ళి ళ్ళు నాకు బాధ కలిగిస్తున్నాయి. సాంప్రదాయం పేరిట లక్షలకు లక్షలు కట్నాలు తీసుకోవడం వగైరాలు నాకు నచ్చవు!" సునంద చెప్పింది.

"సంప్రదాయం గురించి నీకెందుకులే తల్లీ! ఆ ఆచారాలు తరతరాలుగా వస్తున్నాయి. మనం మార్చలేము" జానకిరామయ్య చెప్పాడు సునం దని వారిస్తూ.

"తిక్కతిక్క ఆలోచనలు మానుకో! నీ బాగు నీకు తెలియదుకానీ మేమే నీ మొగుడ్ని సెలెక్ట్ చేస్తాం-" సీతమ్మ చెప్పింది.

సునంద సీతమ్మ బలవంతంమీద ఆ ఫొటో లు చూసింది.

సీతాకోకచిలుకలు వాటి పాదంతో రుచి చూస్తాయి.




"నాకేం నచ్చలేదు" అని చెప్పి లోపలికి పోయి తలుపులు వేసుకుంది. బయటనుంచి తల్లిమాటలు వినిపిస్తున్నాయి.

"పిదపకాలం పిదపబుద్ధులు కాకపోతే - లక్షణమైన సంబంధాలు చూపిస్తూ ఉంటే నచ్చ లేదుట! మన మొహానికి ఇంతకంటే మంచి వాళ్ళెవరు వస్తారు?"

"సీతా! ఆవేశపడకు - కాలంతో అన్నీ సర్దు కుంటాయి. దాని వయసేం మీరిపోలేదు - ఇంకా చూద్దాం" తండ్రి చెబుతున్నాడు.

సునంద ఆలోచనలు అక్క సునీత పెళ్ళి మీదకు పోయాయి. సునీత బాగా చదువుకుంది. ఓ కాలేజిలో లెక్చరరుగా చేస్తున్నది. ఆమెను చూసి ఓ ఇంజనీరు మోజు పడ్డాడు. తల్లిదండ్రులద్వారా కబురు చేశాడు.

కులాలు, గోత్రాలూ కలవడంతో సాంప్రదాయ ప్రకారంగా పెళ్లి జరిగింది - సునీతకు ఆనంద్‌తో.

సునీత ఉద్యోగం చేస్తున్నా ఆనంద్ మూడున్నర లక్షలు కట్నం తీసుకున్నాడు. ఆపైన లాంఛనాలకు ఓ యాభైవేలు అయింది. పెళ్ళి కళ్యాణ మండపంలో జరిగింది వైభవంగా. మండపానికి ఓ యాభై వేలు - కేటరింగుకు ఓ లక్ష ఇంకా చిన్నాచితక ఖర్చులు - వెరసి మొత్తం ఆరులక్షలు దాటిపోయింది సునీత పెళ్ళి ఖర్చు.

సునీత ఆనందంగా ఆనంద్‌తో కాపురానికి వెళ్ళిపోయింది - కానీ అప్పుడే బిటెక్‌లో చేరిన సునందకు ఆ ఖర్చులు తల్లిదండ్రుల్ని ఎంత అతలాకుతలం చేసాయో అర్థమయింది.

పెళ్ళికి చేసిన వడ్డీలు కట్టలేక అలిసిపోయిన తండ్రి - తాతలనాటి నుంచి వస్తున్న 3 ఎకరాల పొలం అమ్మేశాడు తనకిష్టం లేకపోయినా.

ఎంతో కష్టపడి బ్యాంకులో దాచుకున్న డిపాజిట్లను, సేవింగ్స్‌నీ ఖర్చు పెట్టుకోవలసి వచ్చింది - అప్పులు తీర్చడానికి.

పెళ్ళి అయిన తరువాత సునీత - ఆనంద్ తో అప్పుడప్పుడూ వచ్చేది - అప్పుడు వారికి ఘనంగా వేడుకలు జరిపి - లాంఛనాలు ఇచ్చే వారు. ఆ తరువాత సునీతకు కాన్పు అయింది. పిల్లలు పుట్టారు. ఏతావాతా ఆమె పురుళ్ళకు - పండుగలకు - అల్లుడి కోర్కెలు తీర్చడానికి జానకిరామయ్య చాలా ఇబ్బంది పడడం సునంద గమనించింది.

అప్పుడప్పుడూ అక్కయ్యను మందలించేది కూడా. "నువ్వు చిన్న పిల్లవు నీకేం తెలీదు. పుట్టింట్లో మర్యాదలు జరగకపోతే మెట్టినింట్లో ఆడపిల్లకు విలువుండదు" అని సునీత సునందకు నచ్చచెప్పేది.

సునీత వేలకువేలు సంపాదిస్తున్నా ఒక్క వందరూపాయలు పెట్టి తల్లిదండ్రులకు ఏనాడూ ఆమె తెచ్చింది లేదు - వీరు ఆశించింది లేదు.

"అదేంటే అక్కా! అమ్మానాన్నకు కనీసం బట్టలు కొనుక్కురాకపోతివి!" అని ఎప్పుడన్నా సునంద అంటే - సునీత "సునందా! నీకేం తెలీదు - నేను తెచ్చిన బట్టలు అమ్మావాళ్ళు పుచ్చుకుంటారా? ఆడపిల్ల డబ్బు ఆశిస్తారా? ఒకవేళ డబ్బు పంపుదామన్నా అత్తారింట్లో తెలిస్తే గొడవ అవుతుంది" సునీత సునంద నోరు మూయించేది.

సునంద మటుకు సునీత ప్రవర్తనను ఒన్‌వే ట్రాఫిక్‌గా పరిగణించేది - 'మాయింటి కొస్తే ఏం తెస్తావు? మీ యింటికొస్తే ఏం పెడతావు?' అన్నట్లు ప్రవర్తించేది సునీత. సాంప్రదాయం పేరిట తన ప్రవర్తనను సమర్థించుకునేది.

సాంప్రదాయం మాటున ఎన్ని మధ్యతరగతి కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయి - మానసికంగా బాధపడుతున్నాయో వయసు వచ్చిన సునంద గమనించసాగింది.

కట్నాలు - సాంప్రదాయాలు ఒక విషవలయం! నేడు కట్నంని వ్యతిరేకించిన యువతి రేపు అత్తగారి హోదాలో కట్నం కోరుకుంటుంది తన కొడుక్కి! తల్లి హోదాలో కూతురికి కట్నం ఇవ్వడానికీ వెనుకాడదు. ఈ దుష్ట సాంప్రదాయాలకు అంతం ఎప్పుడు? రోజులు దొర్లుతున్నాయి.

జానకిరామయ్య కొన్ని సంబంధాలు తీసుకురావడం - సునంద వాటిని తిరస్కరించడం - సీతమ్మ శాపనార్థాలు పెట్టడం జరిగిపోతూ ఉంది.

ఒక రోజు సునంద తల్లిదండ్రులకు చెప్పింది.

"నాన్నా! నేను రిజిస్టరు మ్యారేజి చేసుకుంటున్నాను!"

"నీకేం పొయ్యేకాలమే - రిజిస్టరు మ్యారేజి ఏంటి - మన వంశంలో ఇంతవరకూ ఎవరూ చేసుకోలేదు" సీతమ్మ ఆక్రోశించింది.

"ఏమ్మా! ఎవరినన్నా ప్రేమించావా? మాకు చెప్పచ్చుగా - నీకు తగినవాడో కాదో తేలుస్తాంగా-" బాధగా చెప్పాడు జానకిరామయ్య.

"అది కాదు నాన్నా! జీవితాంతం కాపురం చేయాల్సింది నేను - అందుకే ఆ కష్టం మీకెందుకు కలిగించాలని వరుడ్ని నేను ఎన్నుకొన్నాను" సునంద సిగ్గుతో తలవంచుకుని చెప్పింది.

"సునందా! మేమింకా బ్రతికే ఉన్నామమ్మా! ఆడపిల్ల పెళ్ళి చేయలేని అసమర్థుడు అనుకున్నావా నీ తండ్రి!" గుండెలు పిండివేసే బాధతో అన్నాడు జానకిరామయ్య.

"ఈ ప్రేమలు - దోమలు మా యింటావంటా లేదు. అందుకే ఆడపిల్లకు చదువు వద్దండీ

అంటే నా మాట విన్నారా? ఉద్యోగాలు వద్దు అంటే వినలేదు. ఇప్పుడు చూడండి - అది ఏ వెధవనో మీ అల్లుడు అంటూ తెస్తే మనం తల ఎక్కడ పెట్టుకోవాలి?" సీతమ్మ చిందులు వేసింది కోపంగా.

"అమ్మా! నేనేం కానిపని చేయలేదు. అల్లుడు గారు మీకు తగినవారే! మన సాంప్రదాయం - మన కులంలో పుట్టి పెరిగిన వారే! ఉద్యోగస్తుడే!" సునంద చెప్పింది.

"మరి మాకు చెప్పచ్చుగా ముందస్తుగా-" తండ్రి ప్రశ్న.

"అవును మాకు ముందు అతడ్ని పరిచయం చెయ్యి - వాళ్ళ వంశం - గోత్రం చూసింతర్వాత అప్పుడు నువ్వు చేసుకోవాలో లేదో మేం నిశ్చయం చేస్తాం!" తల్లి చెప్పింది.

"సారీ! అంతా నిశ్చయించుకున్నామమ్మా! పెద్దమనసు చేసుకుని మీరొచ్చి ఆశీర్వదిస్తే చాలు!" చెప్పింది సునంద.

"సంతోషమమ్మా! పెళ్ళి అయింతర్వాత చెప్పలేదు. ముందుగాచెప్పి - మా పరువు నిలబెట్టావు!" దుఃఖాన్ని అదుముకుంటూ చెప్పాడు జానకిరామయ్య.

"అయినా రిజిస్టరు పెళ్ళి ఏంటండీ? నలుగురి ముందు వైభవంగా తాళి కట్టించుకోకుండా - సంతకాలు పెట్టి - దండలు మార్చుకోవడమేంటండీ!" సీతమ్మ ఆవేదనగా అంది.

"సునందా! నువ్వు వివరాలిస్తే వాళ్ళింటికి పోయి అన్నీ మాట్లాడి సాంప్రదాయంగా పెళ్ళి చేస్తామమ్మా!" తండ్రి జానకిరామయ్య బాధగా అన్నాడు.

"సారీ! నాన్నా! నా పెళ్ళి నా ఇష్టప్రకారం జరగాలి!" చెప్పింది.

> కట్నం మీద ఆశపడి మరో అమ్మాయిని పెళ్లి చేసుకుంటారా?" ఏడుస్తూ అడిగింది కమల భర్తని.
>
> "ఛ... ఛ... నేనంత దుర్మార్గుడిని కాదు కమలా! కట్నం ఇస్తే మళ్లీ నిన్నే పెళ్లి చేసుకోవడానికైనా నాకు అభ్యంతరం లేదు". ఓదార్చాడు జాలిగుండె గల భర్త.

ఓ వారం రోజుల్లో చాలా సింపుల్‌గా సునంద సుధాకర్‌ని పెళ్ళి చేసుకుంది రిజిస్టరు ఆఫీసులో. ఆర్భాటాలు లేవు, విందు వినోదాలు లేవు.

అల్లుడ్ని చూసి జానకిరామయ్య, సీతమ్మలు సంతోషించారు. సునీత కూడా చెల్లెల్ని అభినందించింది.

"ఒసేయ్! సుధాకర్ నీకు అన్నిరకాలుగా తగినవాడిలాగున్నాడు - కానీ... ఎందుకు అలా దొంగపెళ్ళి చేసుకున్నావో నాకు అర్థంకాలేదు" సునీత చెల్లెల్ని అభినందిస్తూనే ఆక్షేపించింది.

"అవును సునందా! ఈ ఇంట్లో చివరిపెళ్ళి వైభవంగా జరిగితే అత్తమామలకు ఆనందంగా ఉండేది - మన కుటుంబగౌరవంకు తగ్గట్టుగా ఉండేది" ఆనంద్ సలహా యిచ్చాడు - మరదలికి.

జానకిరామయ్య, సీతమ్మలు అందరికీ విందు ఏర్పాటు చేస్తానంటే సునంద వ్యతిరేకించింది.

అలాగే సుధాకర్ తరపు వాళ్ళు కూడా రిసెప్షన్ ఏర్పాటు చేస్తానంటే వద్దని చెప్పింది.

బంధువుల్లో ఈ వార్త సంచలనం కలిగించింది. సునందలో ఏదో లోపాన్ని వెతకడానికి ప్రయత్నించారు. సుధాకర్‌లోని మచ్చల్ని వెతికే

ప్రయత్నం చేశారు. చుట్టుప్రక్కల వాళ్ళు చెవులు కొరుక్కున్నారు.

జానకిరామయ్యగారి మిత్రులు – సీతమ్మ నేస్తాలు హర్షించినట్లే హర్షిస్తూ అక్షింతలు జల్లారు.

సునంద ఇవన్నీ వినీవిననట్లు ఊరుకుంది.

జానకిరామయ్య రిటైర్ అయ్యాడు.

రిటైర్‌మెంటు బెనిఫిట్లు చేతికి అందాయి.

సునంద – సుధాకర్‌లు పట్టణంలో ఓ మూల వేరే ఇల్లు తీసుకుని కాపురం ఉంటున్నారు స్వతంత్రంగా.

సునీత తండ్రిని, తల్లినీ తమ దగ్గరకొచ్చి ఉండమని ఆహ్వానించింది – తామిద్దరమే ఉన్నామంటూ.

"ఏమేవ్! సునీత పిలుస్తున్నది – రిటైరయి యిక్కడఉండి ఏం చేస్తాం – పెద్దమ్మాయి దగ్గరకు వెళదాం!" జానకిరామయ్య చెప్పాడు.

"నిజమే కానీ – ఆనంద్ అంతరంగం ఏమిటో నాకు అర్థంకాదు – అతనికిష్టం ఉందో లేదో–" సీతమ్మ అనుమానం వ్యక్తపరచింది.

"అతనికిష్టం లేందే – అమ్మాయి మనల్ని పిలవదుకదా?"

"ఓ మాట సునందను కూడా అడిగి వెళితే బాగుంటుంది – అది ఎలాగూ ఈ రోజు రాత్రికి వస్తానంది గదా!" చెప్పింది సీతమ్మ.

"నిజమే! దానికి కోపం రావచ్చుగా – దాని అభిప్రాయం కూడా కనుక్కుని వెళదాం. ఆర్నెల్లు పెద్దమ్మాయి దగ్గర – ఆర్నెల్లు చిన్నమ్మాయి దగ్గర ఉండాల్సివస్తుందేమో!" జానకిరామయ్య చెప్పాడు.

అనుకొన్నట్లుగా ఆ రాత్రి సునంద ఒంటరిగా వచ్చింది.

"ఏమే! అల్లుడుగారు రాలేదు – ఎక్కడ?" సీతమ్మ అడిగింది.

"ఆయన బెంగుళూరు ఆఫీసు పనిమీద వెళ్ళారు – ఓ వారం దాకారారు–" చెప్పింది సునంద.

"నీ కాపురం బాగుందా సునందా?" తల్లి ప్రశ్న.

"ఏరికోరి చేసుకున్న మొగుడు – బాగుండక ఎలా ఉంటుంది?" తండ్రి జానకిరామయ్య జవాబు.

"అదికాదే సునందా! నీ అక్క సునీత మమ్మల్ని వాళ్ళింటికి రమ్మని ఆహ్వానిస్తున్నది–" చెప్పింది సీతమ్మ.


"ఓ రెండురోజులు పోయిరండి" సునంద చెప్పింది.

"ఊహూ! అలాకాదు – ఈ ఇల్లు అద్దెకిచ్చేసి వాళ్ళింటికి వచ్చెయ్యమంది – తనతో ఉండిపొమ్మంది" చెప్పారు.

"చూశావుటే చిన్నకూతురైన నీకు ప్రేమ లేకపోయినా – పెద్దకూతురికి ప్రేమ ఉంది మామీద" చెప్పింది సీతమ్మ.

సునంద కాసేపు గంభీరంగా ఉండిపోయింది. ఆ తర్వాత చెప్పింది.

"అమ్మా! అక్క పిల్చిందని సంతోషపడుతున్నావు కానీ – అక్కడికి వెళ్ళింతర్వాత నిజం నీకు తెలుస్తుంది. దానికిప్పుడు ఇద్దరు చిన్న పిల్లలు – వాళ్ళని చూసుకునే వాళ్ళు కావాలి! నాన్నకు రిటైర్‌మెంటు బెనిఫిట్లు వచ్చాయి. వాళ్ళు కొత్తగా ఇల్లు కట్టుకుంటున్నారు – దానికి ఆ డబ్బులు కావాలి! మీ దగ్గరున్నదంతా అయిపోయింతర్వాత – మీ అవసరం తీరింతర్వాత




– దానికి మీమీద నిజమైన ప్రేమ ఉంటుందా అని కాస్త ఆలోచించండి! పైగా నాన్నకొచ్చే పెన్షన్ తనకి ఇస్తాడని దాని ఆశ!"

జానకిరామయ్య, సీతమ్మ ఆ మాటలు విని బిత్తరపోయారు. చాలాసేపటికి సీతమ్మ అంది.

"ఏమోనే! నువ్వయితే సాంప్రదాయాన్ని ఎదిరించి చేసుకున్నావు కానీ – అది ఎప్పటికీ సంప్రదాయబద్ధమైన పిల్లే! కాబట్టి మా బాధ్యత స్వీకరిస్తానంటున్నది. అది ఎప్పుడూ మా మాటవినే పిల్లే!"

"సునందా! నువ్వు ఎందుకు తొందరపడ్డావు? నీ పెళ్ళి మేము చేయలేమనుకున్నావా? మాకు ఆ అవకాశం ఎందుకివ్వలేదు" జానకిరామయ్య తన మనసులో గూడు కట్టుకున్న బాధను బయటపెట్టాడు.

"నాన్నా! మీ వృద్ధాప్యంలో మీరు ఎవరిపైనా ఆధారపడకూడదు. బ్రతికినన్నాళ్ళూ పులిలాగా బ్రతికి మీరు చివరిదశలో అల్లుళ్ళ దయాధర్మం మీద ఆధారపడ్డం నాకిష్టం లేదు. ఆర్థిక స్వాతంత్ర్యంలో నిజమైన స్వాతంత్ర్యం ఉంది. నా పెళ్ళికని మీకొచ్చేదంతా ఖర్చు పెడితే – రేపు నేను కానీ – అక్క కానీ చూడకపోతే మీగతి ఏమవుతుంది? అందుకే నాకు మచ్చవచ్చినా ఫరవాలేదుకానీ – ముసలితనంలో మీకు మన స్థాపం రాకూడదని నేను ఆ నిర్ణయం తీసుకొన్నాను. మీ ఇంట్లో మీరు ఉంటే మీకుండే గౌరవం వేరు నాన్నగారూ!" సునంద సజలనయనాలతో చెప్పింది.

"సునందా! సారీరా. నిన్ను బరితెగించినదానివనుకున్నా కానీ బ్రతుకు లోతు చూసిన దానివనుకోలేదు–" జానకిరామయ్య చెప్పాడు.

"చిన్నదానివైనా పెద్ద సత్యం చెప్పావు – మేం ఎక్కడికీ పోము" సీతమ్మ చెప్పింది.

సునంద ఆనందంగా వారిని కౌగలించుకుంది. ●